
# సెల వేసిన మౌనం

లక్ష్మీనారాయణ



"ఇప్పుడెందుకు మళ్లా బయటకు తీస్తున్నారు దాన్ని! అసలే ఇల్లు ఇరుగ్గా ఉంటే?" అన్న స్వగతంలాంటి ప్రశ్న, తగలాల్సినచోటే తగిలింది-మరి అది శరమాయె.

ముందుగా స్పందించింది మాత్రం 'అహం'. పైగా దానికి మగవాసన కూడా కలిస్తే ... అందుకే దశాబ్దంన్నర పైగా అలవాటైన 'మౌనం' జోకొట్టింది.

జవాబుగా మౌనం! మరింత మౌనం.

ఆ ప్రశ్న సంధించింది మరెవరో కాదు, నా భార్య. పేరు వాగ్దేవి.

నిజానికి నేనంటున్న 'మౌనం' ఆవిడగారి దృష్టిలో మొండితనం.

రంగుటద్దాలు పొదిగిన రామణీయకత, సరిగమల సంసారంలో పదనిసల ముక్తాయింపు.

• • •

నాకు వీణన్నా, వీణానాదమన్నా చాలా ఇష్టం. వీణ వాయించడం రాకపోవడం కారణమనుకుంటా.

అసలు నాకు వీణంటే అంత ఇష్టమని కళ్యాణిని చూశాక తెలిసిందా, లేక కళ్యాణి పరిచయంతో వీణమీద ఆసక్తి కలిగిందా? ఏది ముందు? ఏది వెనుక?

సరే, ఆ పరిచయం క్రమంగా జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయిన తరువాతనే కదా, కనీసం వీణ రాకపోయినా, వాగ్దేవి పేరున్న ఈమె గొంతు వీణలా, శ్రుతిసుభగంగా, వీనులవిందుగా ఉంటుందనుకున్న నా అంచనా తప్పని ఆ మూడు రాత్రుల్లోనే తెలిసిపోయింది.

అప్పట్నించే అనుకుంటా మౌనరాగాన్ని

ఆలపించటం, మౌనాన్ని ఆరాధించడమూ, మౌనాన్ని ఆత్మీకరించడమూ తదితరాలన్నీ అవసరమయ్యాయి. టు బి ఫ్రాంక్ టు సేవ్ అవర్ స్కిన్! య్యా!

● ● ●

ఎప్పటి కళ్యాణి!

ఆ రాగమంత పాతదా? ఆ భావమంత నిత్యనూత్నమయినదా?

ఆ ఆలాపనంత శ్రుతిపక్వమయిన సుస్వర మాధుర్యమా?

అసలా తలంపే పొయిటిగ్గా ఉంటేందేమిటి?

ఇప్పటికీ ఆ గొంతూ... ఆ రాగాలాపనా... సుదూర తీరాల్నించి నా చెవుల్ని సోకుతున్నంత సున్నితమైన భావావేశం, చిరుస్పందన, మెల్లగా శరీరమంతా పాకిన అనుకంపన... ఏమిటీ వింత అనుభూతి? ఇది తాత్వికమైనదా? ఆధ్యాత్మికమైనదా?

ఆ తాదాత్మ్యంలో నన్ను నేను ఏ కొద్ది క్షణాలైనా మరువగలిగినప్పుడు... ఓహ్...! అద్భుతం! అమరలాలిత్యం... ఆపాతమధురం! ఆ ఆలాపన... ఆమె...! ఆమె గానం....! కళ్యాణి...!!

● ● ●

ఇంతకీ ఇరుగ్గా ఉన్న ఇంట్లో నేను తీశానంటున్నది ఇంటికి అడ్డంగా ఉందన్నది, 'అది', లేదా 'దాన్ని' అని ఎంతో తృణీకార, ధిక్కార స్వరంతో ఆవిడగారు ప్రస్తావించిందీ-వీణ!

తొలినాళ్లల్లో గొణుగుడుగా, అదే స్వగతంలా... తరువాత్తర్వాత చిన్నపాటి అభ్యర్థన గొంతులో మిళాయించిన ఆజ్ఞాపనలా... అంటే 'రాయల్ వుయ్' అంటామే అటువంటిది.

అందాకా చిక్కని, చిక్కటి మౌనానికి దొరికిన అంచక్కని తరుణోపాయం. నే చేయించదలచిన డబుల్‌కాట్ మంచంలో ఆ వీణను అమర్చుకోవాలనుకోవడం, ఆలోచన వచ్చిందే తడవుగా, నా భుజం నేను తట్టుకున్నా అభినందన పూర్వకంగా, కానీ... ఈ మాటే కార్పెంటర్‌తో అంటే నన్ను వాడు చూసిన చూపు... ముందు ప్చ్! ఎవరు ఏమనుకుంటే ఏంగానీ...

నా ఆలోచన ఆచరణ రూపందాల్చి తరువాత ఆవిడగారి కళ్లల్లో కనిపించిన ఏదో రిలీఫ్‌లాంటి... ఏదైతేనేం... అడ్డు తొలగిందన్న భావంతోపాటు చిన్నపాటి మందహాసం... అది నాపై అప్రయత్నంగా ఒలికిన అభినందన తొలకరి వీవనా, లేక తన మాట నెగ్గిందన్న విజయవిలాసమా? స్పష్టంగా తెలియలేదు.

అప్పుడప్పుడూ ఆ వీణను బయటకు తీసి కచేరీ ఇవ్వబోయేముందు చేసే హడావుడంతా చేస్తాను. పైగా ఏదో తెలియని గొప్ప సంతృప్తితో మునివేళ్లపై జ్ఞాపకాల స్వరాలను మీటుతున్నంత ఆత్మానందంతో, కచేరీ అయిన అనంతరం అభినందనపూర్వకంగా ప్రేక్షకుల 'స్టాండింగ్ ఒవేషన్'ని ఫీలవుతూ.

అలా అనేకంటే చాలా జాగ్రత్తగా శుభ్రం చేసి, కాసిని జ్ఞాపకాలను కలబోసుకుంటానంటే సబబుగా ఉంటుందేమో!

● ● ●

అందాకా నా గతాన్ని చూచాయగా ఆకర్ణించుకున్న శ్రీమతి వాగ్దేవికి, అప్పటివరకూ నేను కేవలం వీర వీణాభిమానినన్న నమ్మకానికి 'కళ్యాణి' ముక్తాయింపుతో, నా మౌనానికి మరిన్ని అర్థాలు స్పష్టంగా స్ఫురించసాగాయి.

వాగ్దేవి చేతిలో కేవలం వీణనుంచితే ఎంతో బాగుంటుందనుకుంటున్న నేను, కరవాలం చేపట్టిన వీరవాగ్దేవిని కూడా ఈ జన్మలోనే సందర్శించి, తరించి, జన్మ సాఫల్యం పొందిన ధన్య'జీవి'నయ్యాను కదా అనిపించింది.

● ● ●

అయిదారు వాటాలున్న కాంపౌండులో మేడమీది రెండు వాటాల్లో... అప్పుడు ఒకదాంట్లో నేనుండేవాడిని, కింది వాటాల్లో ఎవరెవరు ఉంటున్నారో నాకు తెలియదుకానీ, నన్ను గమనించే కొన్ని జతల కళ్లకు, అందులో సగంలో సగానికి చిర్నవ్వులు చిందించేంత పరిచయం నా ఉనికి్క కలిగిందనుకోవడం అప్పట్లో ఓ గొప్ప ఎఛీవ్‌మెంట్. ఆ తృప్తే... ఆ మట్టి రోడ్లపై గొప్ప ధీరోదాత్తంగా నన్ను నడిపించేది.

ఆ వల్మీకంలో ఉన్న నన్ను గొప్ప ఆరాధనతో, నా మనసును స్పృశించినది 'కళ్యాణీ' ఆమె గొంతూ. ఆ రాగాలాపనా, ఆ వేకువవేళ అలసటతో సుషుప్తి యవనికల్లో పడి ఉన్న నన్ను సేదతీర్చిందీ ఆ భూపాలమే.

అప్పటికి నాకు పరిచయమైనవి... కొన్ని జతల కళ్లూ, మరిన్ని చిర్నవ్వులూ. ఇప్పుడు ఈ గొంతూ... గొప్ప ఆబ్‌స్ట్రాక్ట్‌గా అనిపించింది.

## బాజ్‌పాయికి డిమాండ్

'సత్య'లో భికూమాత్రేగా నటించిన మనోజ్‌బాజ్‌పాయికి మంచి అవకాశాలొస్తున్నాయి. రామ్‌గోపాల్‌వర్మ తన తరువాతి చిత్రం 'కౌన్'లో ఊర్మిళతో తీసుకున్నాడు. ఏ.బి.సి.ఎల్. వారి అమితాభ్ బచ్చన్ నటించిన ఈ చిత్రంలో మనోజ్ పాత్ర ఎలాంటిదనుకుంటున్నారు? విలన్ పాత్రండీ బాబూ! నిజం! అదీ సరాసరి అమితాభ్ మీదే విలనీని ప్రదర్శించే పాత్ర. ఈ చిత్రానికి దర్శకుడు రాకేశ్ మెహ్రా. అబ్బీ బేబీ మ్యూజిక్ వీడియోలు, ఏ.బి.సి.ఎల్. చిత్రాల దర్శకుడితనే. మనోజ్ తక్కిన చిత్రాల్లో విలన్‌గానేమీ వేయడం లేదు. రవీనాటాండన్‌తో పోలీస్ హీరోగా 'శూల్'లో చేస్తున్నాడు. దీని దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మే! రమేష్ సిప్పీ తరువాతి చిత్రంలో తబ్బూతోనూ చేస్తున్నాడు మనోజ్‌బాజ్‌పాయి. జీరోనుంచి హీరోగా ఎదిగాడు మరి! సెభాష్ మనోజ్! అభినందనలు!

ఎం.వి.





## చీచీ-లోలో గొడవ పడ్డారా?

**అ**వునంటున్నారు కొందరు. హిట్ పెయిర్‌గా పేరు పొందిన గోవింద-కరిష్మ (వీళ్లిద్దరి ముద్దుపేర్లు చీచీ-లోలో) ప్రస్తుతం గొడవల్లో వున్నారన్న వార్త ఒకటి వ్యాపించింది. బాక్సాఫీసు హిట్లు ఇచ్చిన ఈ జంట ఇలా మారిందేమిటాని అందరూ ఆశ్చర్యపోతున్నార్ట కూడా! ఇందువల్ల ఎన్.చంద్ర నిర్మిస్తున్న చిత్రం 'షికారీ' దెబ్బ తింటూంది. ఇందులో గోవింద తొలిసారిగా విలన్‌గా నటిస్తున్నాట్ట. (బహుశా ఇదే ఆఖరి సారేమోకూడా!) చాలా చనువుగా, చక్కని మిత్రుల్లా వుండే చీచీ-లోలో ఎందుకు గొడవ పడ్డారో, అందుకు కారణాలేమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. కొందరైతే, ఇటీవల గోవింద, ఊర్మిళామాతోండ్కర్, రాణీముఖర్జీలంటే చాలా మోజు చూపుతున్నాడూ అనంటున్నారు! కాని మరి కొందరి కథనం ప్రకారం కరిష్మే గోవిందతో కలిసి ఇక చిత్రాలు చేయనని అంటూందిట. ఇందుక్కారణం అనేక ప్రశంసలూ, బహుమతులూ, 'రాజా హిందుస్తానీ' చిత్రంలో నటనకు ఉత్తమనటి అవార్డును కొట్టేయడంతో, తన స్థాయి పెరిగిందని కరిష్మ అనుకోవడమేనట! దీని ఫలితంగా కరిష్మ హీరోయిన్‌కు ప్రాధాన్యం గల చిత్రాలే చేస్తానని పట్టుబడుతూందని మరో వార్త. ఎందుకింత మార్పొచ్చింది కరిష్మలో? "నా కూతురి వినయమే ఆమెకు శ్రీరామరక్ష!" అని తండ్రి రణ్‌ధీర్‌కపూర్ మురిసిపోవడం ఉత్తదేనన్నమాట! అంతేనా కరిష్మా?

ఎం.వి.

● ● ●

ఆ మట్టిరోడ్డుమీద నే చూసిన కారూ, దాంట్లోంచి పల్చటి రావాకు రంగు చెప్పులూ... ఆపై పచ్చటి పాదం, దానికి అమరిన బంగారుపట్టీ, ఆపై తెరచిన కారు కిటికీ... వాలిన తుమ్మెదలు వరుసగా, వాటిని చేతివేళ్లుగా గుర్తించగలగడం ఒక అనుభూతి. అంతటి సున్నితమైన చేతివేళ్లను చూడడం అదే ప్రథమం, ఆ తర్వాతనే కదా! ఆ కళ్లు.... సింహాచలంలో దొరికే ఆకు సంపెంగ రేకంత... ఆ కన్ను... ఆపై ఆ ఆకు సంపెంగ రేకునే రెండుగా చేసి అతికించినట్లున్న పెదవులు... సన్నగా విచ్చుకున్నాయి. మొత్తానికి ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రం కాన్వాస్‌పై బాగానే కుదిరింది.

● ● ●

"మీ 'కచ్చేరీ'! అయితే భోజనం చేద్దాం!" అన్న ప్రకటన, కచ్చేరీ అని నొక్కి వక్కాణించడంలోని సీరియస్‌నెస్ గమనించాను మౌనంగానే.

● ● ●

ఆ రాత్రి మేడమీద పచార్లు చేస్తున్న నన్ను మరలా ఆ గొంతే... ఇంతకూ, ఇంతక్రితం కారులోంచి దిగిన చిన్నదాని గొంతేనా అది అని మొదటిసారి అనిపించింది. అలా అయితేనే పరిపూర్ణత్వం సిద్ధించినట్లవుతుందన్న భ్రాంతిలాంటి భావంలాంటి, ఆశలాంటి భావం... ఏదో తెలియని అలసట సుషుప్తి వల్మీకంలో నేను... ఎప్పటిదాకా, భూపాలం వినబడేంతవరకూ...

ఆ గొంతు పేరు కళ్యాణని నేను విన్న స్వరార్చన ఉదయంలో, మీకు వీణొచ్చా అనడుగుదామనుకుని.

కళ్యాణికి వీణొచ్చా అనడగడమూ, సరస్వతిని మీరెందాకా చదువుకున్నారూ? అనడగడమూ, హిందోళంలో రిషభం వేయడంలా ఉంటుందనిపించి, నన్ను నేను సంబాళించుకున్నాను.

"ఇప్పుడైతే ఇన్నిన్ని కబుర్లు చెబుతున్నావు కానీ, నీకు పెళ్లయ్యాక నువ్వొక గొప్ప 'మౌని'వి అవుతావేమో!" అంది కళ్యాణి కళ్లతో భయాన్ని అభినయిస్తూ, ఆ సాయంత్రం గుండెలపై రెండు చేతులూ వేసుకుని "తప్పదు!" అంటూ.

నీ సమక్షంలో, నీ గొంతు వింటూ, నీ వీణాలాపన వింటూ మౌనంగా ఉండగలగడం గొప్ప వరమే కదా అనుకున్నాను, లేదా స్వగతించాను.

"ఆఁ ...!" అంది.

నేనన్నది అర్థమయిందనుకుంటా.

● ● ●

"మీరొస్తే పడుకోవచ్చు, నాకు నిద్రొస్తోంది!" అంది శ్రీమతి వాగ్దేవి. ఆ వెన్నెల వేళ మేడమీది ఒంటరి గతానికి వాస్తవం రగ్గు కప్పుతూ.

ఏమయితేనేం మా దారులు వేరైపోయాయి. ఏదో కచేరీ ఇస్తున్నప్పటి వార్తో, ఫొటోనో చూడటం తప్ప ఆమె సంగతులు ఏమీ తెలియదు ఆ తర్వాత.

● ● ●

"రావాలనిపించిందీ, వచ్చాను! ఇప్పుడు పోవాలనిపించిందీ, పోతున్నాను!" అన్న గొంతు విని, అందాకా 'విశ్వతేజ' ఆఫీసులో ఏదో మాగజైన్ తీవ్రంగా చదువుతున్న నేను దిగ్గున తలెత్తి ఆ మాట వినవచ్చిన దిశగా చూశాను. ఆ ఆఫీసులో ఇంజనీరు రవి మిత్రుడుని కలవడానికి వెళ్లాను ఆ మధ్యాహ్నం. అంతే! ఏదో దెబ్బతిన్నట్లయి చరచరా వెళ్లిపోయింది ఆమె... ఆమె కళ్యాణే! సరిగ్గా పదిహేనేళ్ల క్రితం నేను విన్న ఆమె గొంతులోని మాధుర్యమూ, ఆ లాలిత్యమేదీ, ఈ మార్మికత ఎలా అలవడింది అనిపించింది- ఎవరితో అలా అన్నదో కూడా నేను ఆలోచించలేదు. అన్యమనస్కంగా అక్కడ్నించి వచ్చేశాను.

● ● ●

"ఇది చదివి, చెప్పు!" అన్నా శేఖరంతో ఆ మధ్యాహ్నం బోట్ హౌస్‌లో బీరు తాగుతూ.

పదినిముషాల అనంతరం "దీనికి ముగింపు ఏదోయ్, విశ్వనాథం?" అన్నాడు మాట తడబడుతూండగా.

చిన్నగా నవ్వి, పరవాలేదే అన్నట్లుగా చూశాను.

"అవును, చిరంజీవీ! ఈ కథకు చక్కని ముగింపు ఇవ్వద్దూ?" అన్నాడు బతిమాలుతున్న

ధోరణిలో.

శేఖరం ఇక్కడే ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. బీరు తప్ప మరి అది అమృతమైనా సరే, ముట్టడు, తాగడు! అలాంటిది రెండు బీర్లు పట్టించిన అనంతరం విచిత్రమైన పేర్లతో సంబోధించడం అనేది వాడికి అరడజను బీర్లు పట్టించినంత 'ఈజీ... ఈజీ' అన్నమాట!

మరో బీరు గ్లాసులో పోస్తూంటే శేఖరం, జేబులోంచి ఒక కాగితం తీసిచ్చాను.

"ఓహో! ముగింపు ఇదా!" అంటూ గ్లాసులోంని బీరుని ఒక్క గల్ఫ్‌లో పట్టించి చేతిలోకి తీసుకున్నాడా కాగితాన్ని శేఖరం.

● ● ●

ఎవరిని ఎడ్రస్ చేసుందో తెలియదు కానీ...

"ఆ మధ్యాహ్నం... మిమ్మల్ని ఆఫీసులో చూశాక, ఇది రాస్తున్నాను, నా గొంతు విన్నంతనే మీరు చివుక్కున తలెత్తడంతో మిమ్మల్ని చూశాను, సారీ ... చదివాను.

నేనన్న ఆ మాట మిమ్మల్ని, ముఖ్యంగా నిన్ను చాలా బాధిస్తుందని తెలుసు. కానీ, 'పరిస్థితులంతే!'. నువ్వు బహుశా నన్ను అసహ్యించుకుంటావు. ఎస్! నాలో ఉన్న కళని గాక, ఆ కళ ద్వారా తను ఉన్నతిని కోరుకునే బగాడిని భర్తగా చూళ్లేకపోయాను. అందుకే ఇదుగో... ఇప్పటివరకూ నా గతాన్ని... ముఖ్యంగా నీ జ్ఞాపకాలనూ సమాధిచేసి అలా అనుకున్నాను. నిన్నిక్కడ చూసేంతవరకూ ఎలాగోలా బతుకుదామనుకున్నాను. ప్చ్... సరే, కానీ... ఒక్క మాట! మళ్లా నువ్వు నన్ను చూడొద్దు. నీకు తెలుసు నేను కేవలం జాలిపడటాన్ని సహించలేను. ఏ వంకతోనైనా మా ఆఫీసుకి రావద్దు, కొంతకాలమైనా ఇక్కడ బతకనీ... అర్థం చేసుకోగలవనుకుంటా!" అని సంతకం లేని ఆ కాగితాన్ని చదివాడు శేఖరం.

ఇదేనా ముగింపు అన్నట్లు చూశాడు. ఆ కళ్లల్లోని ఎరుపు జీరలో నన్ను ప్రశ్నించే కొరడాలను ఝళిపిస్తూ.

"అదే ఆఖరు. మళ్లా కళ్యాణిని చూడటం కానీ, కలవడానికి కానీ నేను రవి వాళ్ల ఆఫీసుకు వెళ్లిందీ లేదు, అలా అని వీణ కూడా ఇప్పుడు నా దగ్గర లేదు!" అన్నాను-శేఖరం వేయబోయే తరువాతి ప్రశ్నను గ్రహించినట్లుగా.

"అదెలా?" అన్నాడు మరో సిగరెట్టు వెలిగిస్తూ.

"అదంతే మిత్రమా!" అన్నాను భావస్ఫోరకంగా చూస్తూ.

"ఇది కూడా ముగింపు కాదు, నాగార్జునా!" అన్నాడు శేఖరం గ్లాసు బోర్లిస్తూ అయిపోయిందన్నట్లుగా.

"అవును, నాకు తెలుసు! ఇదంతా జరిగి అయిదేళ్లయిందన్న సంగతి తెలుసు కదా!"

అవునన్నట్లుగా తలూపాడు.

"అంతే! అయిదేళ్లయింది... మీ మాధురికి సంగీతం నేర్పుతున్న గురువు కళ్యాణని నీకు తెలుసా? ఆమె దగ్గరున్న వీణ...

"మూడు రోజుల కిందట మీ అమ్మాయి మాధురికి సంగీతం నేర్పుతున్న కళ్యాణిని మీ ఇంట్లో చూసి..."

శేఖరం నేను చెప్తున్నది విన్నాడో లేదో కానీ, సోఫాలోంచి గురక వినబడింది, రిహార్సల్ అవసరం లేని సైరన్‌లా...!

■



## ఏ.బి.సి.ఎల్.వారి తొలి-చిత్రం హీరో!

**మూ**డేళ్ల క్రితం అర్షద్‌వర్సీ ఓ డాన్సు స్కూలు పెట్టాలని ముంబయికి వచ్చాడు. కాని దర్శకుడు జోయ్‌అగస్టిన్ అతన్ని 'తేరే మేరే సప్నే' చిత్రానికి హీరోను చెయ్యటంతో డాన్సు స్కూలు వాయిదా పడింది. "వ్యాపారప్రకటనలకు, అలిక్ పదంసీ, భరత్ దభోల్కర్ నాటకాలకు కొరియోగ్రాఫర్‌ను నేను. ఒకటి రెండుసార్లు జోయ్‌ని కలిశాను. ఆ తరువాత నా మిత్రుల్లో ఒకరితో నా ఇంటికి డిన్నర్‌కొచ్చారు" అంటున్నాడు వర్సీ ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ. ఆ దర్శకుడు ఆ సాయంకాలమంతా అర్షద్‌ను గమనించి, ఇతను తప్పకుండా మంచి నటుడవుతాడని గ్రహించాడు. మరునాడే ఏ.బి.సి.ఎల్. వారి మొట్టమొదటి చిత్రం 'తేరే మేరే సప్నే'కు హీరోగా చేయమని అవకాశమిచ్చాడు. "ఆయన సరదాగా అన్నారనుకున్నా. అసలు నటించాలో, లేదో ఆలోచించుకునే సమయమే లేదు. ఓ పదిహేన్నిముషాల పాటు ఫోటోలు తీయించుకుని, అన్నింటినీ ఓ నల్లని కాగితమ్మీద అంటించి ఏ.బి.సి.ఎల్. వారికి పంపాను" అన్నాడు వర్సీ. అతనికి తనకవకాశం వస్తుందని నమ్మకం ఏ మాత్రమూ లేదుట! "కాని జయాబచ్చన్ నన్ను పిలిపించి కనీసం స్క్రీన్ టెస్ట్ కూడా చేయించకుండానే అవకాశమిచ్చారు. నేను బాగా హిందీ మాట్లాడగలనో లేదో మాత్రమే పదేపదే అడిగారావిడ. అంతే, నా జీవితం మారిపోయింది!" అంటున్నాడు వర్సీ. స్టేజి షోలు చేసి వుండటంవల్ల కెమేరా ముందు భయం కలగలేదుట అతనికి. ఆ చిత్రం విజయం అతన్ని పూర్తి నటుణ్ని చేసింది. కాని ఏదో ఒకరోజు డాన్సు స్కూలు పెట్టాలని మాత్రం అతని ఆశయం. "ఎప్పటికి నెరవేరుతుందో?" అనుకుంటున్నాడు. చూద్దాం!

ఎం.వి.